# మనిషి- మట్టి

## -కల్లం సుందరరామిరెడ్డి

శ్రీను ఇంటికొచ్చేసరికి ఇంట్లో ఎవరూ లేరు. ఇంటికి తాళం వేసి ఉంది.

'మా అయ్య పొలం వెళ్లుంటాడు. మా అమ్మ కూలికి వెళ్లుంటుంది' అనుకున్నాడు. చావడిలో గేదొకటి పడుకుంటూ లేస్తూ ఉంది. వసారాలో కెక్కురిస్తూ, తిరుగున్న కోళ్లను అదిలించి ఎండుమేత గుప్పెడు గేదెముందు వేసి వచ్చాడు. బాగా ఆకలౌతున్నట్లుంది. కుక్కిమంచం ఒకటి వాల్చుకున్నాడు. కాసేపటిలో నిద్రలోకి జారుకున్నాడు.

''ఎప్పుడొచ్చావురా? తాళం చెవులు దూలం ప్రక్కనున్న గూట్లో ఉన్నాయి. తీసికొని అన్నం తినకపోయావా?'' అంటున్న తల్లి గొంతువిని మేల్కొన్నాడు.

గడ్డిమూట క్రిందపడవేసి తాళందీసి లోనికెళ్ళింది తల్లి.

మంచం మీద నుండి లేస్తూ శ్రీను ''ఇందాకే వచ్చానమ్మా బండి బాగా లేటయ్యింది.''

''ఇయ్యాల కూలికెళ్ళలా. గేదె ఈనేటట్లుంటే నాలుగు గడ్డిపరకలన్నా తెద్దామని పొలానికెళ్లాను. గేదెకి కుడితి పెట్టొచ్చి, నీకు అన్నం పెడతా. కాళ్ళు కడుక్కో.'' అంటూ గేదెవైపు వెళ్ళింది తల్లి మంగమ్మ. అంతలో శ్రీను కాళ్లు కడుక్కొని ఇంట్లో కెళ్లాడు. శ్రీనుకి అన్నం పెడుతూ, ''ఇయ్యాల కూరేమి వండలా. మీ అయ్య చద్దన్నం తిని పొలం వెళ్ళాడు. ఉత్త పచ్చడే. ఈ పూటకు సర్దుకో. సాయంత్రం యేదన్నా కూర చేత్తా!'' అంది తల్లి.

శీను అడిగాడు ''అయ్య! పొలమంటే కూలికెళ్ళాడా? బంజరు భూమికా?'' అని

''అయ్యో! నారాత! కూలికెళితే నీకు పచ్చడి మెతుకుల కర్మేంది. బంజరు భూమికే సచ్చాడు.''

''సాగులోనికి రాని బంజరు భూమిలో అయ్యకెందుకమ్మా కష్టాలు.''

''నేను చెబితే విని సత్తేగా. రెటమతపోళ్ళకి ఎందాక చెపుతాం. ఇంట్లో ఇటుపుల్ల దీసి అటు పెట్టడు. చీకటి ముఖాన బోయి సాయంత్రానికొస్తాడు. ఎప్పుడూ ఆ బంజరు భూమి సోపే''.

''మరి ఇల్లెలా గడుస్తుంది?''

''నేనున్నాగా గానుగ చాకిరి చేయటానికి. గేదె ఇయ్యాలో రేపో అన్నట్లుంటే నేను కూడా కూలికెళ్లటంలా. ఇంట్లో తిరుగమోతకుకూడా నూనెబొట్టులేదు. బడ్డీకొట్లో బాకి అట్లానే ఉంది'' అంది.

శ్రీను అన్నం తినటం పూర్తయింది.

''ఈ కోళ్ళకి నాలుగు గింజలు విదిలించు'' అని తల్లి అంటే శీను ఇంట్లో ఉన్న నూకలను తెచ్చి కోళ్ళకిదిలిస్తూ''అమ్మా కోళ్ళు నాలుగే ఉన్నాయేందే'' అన్నాడు ఆశ్చర్యంగా.

ఇల్లూడుస్తూ తల్లి ''ఏం చేద్దాం మన ఖర్మ. మొన్న వానలకి గత్తరొచ్చి కొన్ని సచ్చాయి. ఇళ్ళమ్మటోళ్ళంతా మంగమ్మకు పిసినారితనమెక్కువ. ఎప్పుడన్నా ఒక కోడిని కోసి కొడుక్కి పెడదామని ఉండదు. అవి రోగాలొచ్చి సత్తే మాత్రం అయ్యో! నాకు కోసుకు తింటానికి చేతులు రాలేదంటారు. వాళ్ళంటానికి అవి సత్తానికి సరిపోయింది.'' అంది.

**దూడ అడ్డం దిరిగింది. బతకడం కష్టమన్నాడు డాక్టరొచ్చి, పై ప్రాణాలు పైనే పోయినట్లయింది. భార్యాభర్తలకి, ఆ రాత్రి మంగమ్మ అనేక దేవతలకి మొక్కుకుంది. మారెమ్మకు కోడిపుంజు నిస్తానంది. మాలక్ష్మమ్మకు చద్ది పెడతానంది. ఏమైతేనేం..గేదె చల్లగా బయటపడింది. పెయ్యదూడ పుట్టింది. భార్యాభర్తల ఆనందానికవధులు లేవు. రాత్రంతా జాగారం చేయటం వలన పొలం వెళ్లలేక పోయాడు నారాయణ.**

శ్రీను కాస్త శుభ్రంగా ఉన్న దుప్పటిని కుక్కిమంచంలో పరుచుకొని పుస్తకాలు ముందేసుకున్నాడు. తల్లి గేదెను బయటికి పట్టుకొచ్చి ఒళ్లు కుడుగుతూ విపరీతంగా దగ్గుతుంది. నోటమ్మటి రక్తం, కళ్లె పడుతోంది.

''ఏందమ్మా దగ్గుతున్నావు. ఒంట్లో బాగా లేదా?'' అడిగాడు కొడుకు.

''ఏందోరా శీను. ఒకటే దగ్గు...ఆయాసం..పైపానం పైనే పోయి నట్లుంటుంది.''

''డాక్టరుకు చూపించుకోపోయావా?''

''ఏటికని వస్తాయిరా డబ్బులు. నీ చదువు కోసమే ఇప్పటికి చాలా అప్పులయ్యాయి. నా రోగానికేమొచ్చెలే గాని నూవెట్టా సదువుతున్నావు.''

''బాగానే చదువుతున్నానమ్మా?''

''ఏంబాగో. నీ సదువు పూర్తయి నౌకరొచ్చేదెప్పుడో. ఆ బంజరు భూమి సాగులోకొచ్చేదెప్పుడో..మా కట్టాలు గట్టెక్కేదెప్పుడో.'' అంది తల్లి.

పూర్తిగా చీకటి పడింది. అప్పుడొచ్చాడు తండ్రి నారాయణ. వస్తూనే మంచంలో కూలబడ్డాడు. కొడుకుని చూచి ''ఏరా అయ్యా! ఎప్పుడొచ్చావ్?'' అన్నాడు ఆప్యాయంగా.

''మధ్యాహ్నాం వచ్చానయ్యా'' అన్నాడు శ్రీను.

తండ్రి నారాయణ కొడుకునేదో అడగబోతుంటే భార్య అడ్డుపడి ''ఎల్లి నాలుగు బుంగలు నీళ్ళు తీసుకురా'' అంది భర్తని.

''నే నెల్లలేనే..ఒళ్ళంతా నొప్పులుగా ఉంది.''

''ఉండదు మరి. ఆ దిక్కుమాలిన పొలానికి చీకటి ముఖాన పోయి రెక్కలిరగదీసికొని ఇప్పుడొస్తివి.'' అంది భార్య.

''అట్టాగనకే. ఆ పొలమే రేపు మనకి నాలుగు మెతుకులు పెట్టేది.''

''ఎట్టుద్ది..ఎట్టుద్ది. ఒకసారే గోతిలో ఎట్టుద్ది. ఎల్లు. ఎల్లి నాలుగు బుంగలు తీసుకురా..ఇంట్లో సుక్కలేవు''

''నేను తేలేనే..''

''మరి ఎవరు తెత్తారు''

''నేను తెస్తాలేమ్మా, అయ్యను తెమ్మనకు'' అంటూ శ్రీను నీళ్ళకెళ్ళబోతుంటే తండ్రి అడ్డుబోయి ''నువ్వేం తెత్తావులేరా అయ్యా! చదువుకున్నోడివి.'' అంటూ బుంగా బక్కెన తీసికుని నీళ్ళకెళ్ళాడు నారాయణ.


ఆ రోజు రాత్రి గేదెకు బరువుగా ఉండడంతో పక్క ఊరు వెళ్ళాడు నారాయణ వైద్యుడు కోసమని. గాలితో వర్షం మొదలయ్యింది. ''నీకు తోడు నేనొస్తానయ్యా'' అన్నాడు శ్రీను తండ్రి వెళ్ళబోతుంటే.

''వద్దులేరా అయ్యా! దారి సరిలేదు. వానలో తడిస్తే జలుబు చేత్తది'' అని ఒక్కడే వెళ్ళాడు. ముసుకుదన్ని నిద్రకు ఉపక్రమించాడు శ్రీను.

దూడ అడ్డం దిరిగింది. బతకడం కష్టమన్నాడు డాక్టరొచ్చి. పై ప్రాణాలు పైనే పోయినట్లయింది. భార్యాభర్త

లకి, ఆ రాత్రి మంగమ్మ అనేక దేవతలకి మొక్కుకుంది. మారెమ్మకు కోడిపుంజు నిస్తానంది. మాలక్ష్మమ్మకు చద్ది పెడతానంది. ఏమైతేనేం..గేదె చల్లగా బయటపడింది. పెయ్యదూడ పుట్టింది. భార్యాభర్తల ఆనందానికవధులు లేవు. రాత్రంతా జాగారం చేయటం వలన పొలం వెళ్ళ లేక పోయాడు నారాయణ.

ముసురుకుంటున్న మేఘాలను చీల్చు కురావటానికి ప్రయత్ని స్తున్నాడు బాలభానుడు.



''ఒరే. శీనా.....ఇంకా పడుకున్నావే మిటి లే..లే..లేచి మొఖం కడుక్కో.'' అంటున్న భార్య మాటలకు మండిపడుతూ ''వాడు లెగిసి పడేసేపాటే ముంది. అక్కడ రెయ్యింబవళ్ళు చదువేగా పడుకోనీ'' అన్నాడు నారాయణ.

★★★

''గేదెను బేరం పెట్టా''

''గేదెను బేరం పెట్టావా? ఎందుకు'' అడిగింది మంగమ్మ.

''అవసరమొచ్చి''

''అంత అవసరమేమొచ్చి సచ్చింది. బంజరు భూముల బండలను లేపటానికి?''

''ఛీ..నోరు తెరిస్తే పొలం సంగతెత్తు తావు. మరోసారి ఆ మాటెత్తావంటే నాలుక చీరేస్తా'' ఆవేశంగా అన్నాడు నారాయణ.

''మరిదేనికి గేదెను బేరమెట్టింది....సంవత్సరముబట్టి మజ్జిగ సుక్కలేక యెంత అల్లాడుతున్నామో..సూత్తానే ఉంటివి గందా? ఒక్కగానొక్క బిడ్డ. ఇంటికొత్తే పచ్చడి మెతుకులేసి పెడుతున్నాను. పాలన్నా అమ్ముకుంటే ఇంట్లో చిల్లర మల్లర ఖర్చులన్నా తీరుతాయనుకున్నాను. చినిగిన బట్టలుతో ఒళ్ళు దాచుకోటానికి సిగ్గేత్తంది'' అంది మంగమ్మ.

''ఏం సేద్దాం. శీను చదువుకు డబ్బు అవసరమొచ్చింది.''

మారు మాట్లాడలేదు భార్య.

★★★

మంగమ్మ గుమ్మం దగ్గర కూలబడి ఉంది. అప్పటి దాకా యేడ్చిందనుకుంటా...కళ్ళు ఎర్రగా..ఉబ్బి ఉన్నాయి. నారాయణ కుక్కిమంచంలో కూర్చుని ఉన్నాడు.

శ్రీను గోడకానుకుని ఉన్నాడు. మరో నలుగురైదుగురు వ్యక్తులు ఎదురుగానున్న పెద్దబండమీద కూర్చొని ఉన్నారు. వారిలో ఒకతను ''ఏంది నారాయణా మాట్లాడవు. మా బాకీ లెట్లా తీరుత్తావు.'' అన్నాడు ఆవేశంగా.

నారాయణ మాట్లాడలేదు.

అతనే అన్నాడు.

''మొన్నటి దాకా నీ బిడ్డకు నౌకరొచ్చిద్ది. మీ అప్పులన్ని తీరుత్తాను అని పెద్ద గొప్పలు పలికావు. ఇప్పుడు నీ బిడ్డకు పెద్ద నౌకరొచ్చింది. మా బాకీలు తీర్చు.''

''ఇంకేం తిరుత్తాడయ్యా! నౌకరొచ్చిన కొడుకు, మాయయ్య జేసిన అప్పులకు నాకు ఎట్టాటి సంబంధం లేదని అయ్యా, అమ్మని కూడా వదలుకుని పట్నం వెళ్తుంటే...ఇంకా ఏం బెట్టి మన అప్పులు తీర్చేంది?'' అన్నాడు మరొకాయన.

బాకీలవాళ్ళు నారాయణను నానా మాటలు అనసాగారు. నారాయణ నోరెత్తలేదు. వంచిన తల పైకెత్తలేదు.

గుమ్మం దగ్గర కూర్చున్న మంగమ్మ పరిగెత్తినట్టుగా శ్రీను దగ్గరకొచ్చి ఏడుస్తూ ''చూడరా శీను! మీ అయ్యను బాకీలవాళ్ళు ఎట్టా మాట్లాడుతున్నారో? నీ చదువు కోసం నీ సుఖం కోసం మా కట్టం చాలక సేసిన బాకీల్రా ఇవి. మా కట్టానికి రేటు కట్టొద్దురా? వాళ్ళకన్నా సమాధానం సెప్పరా? మా అయ్యనేమి అనకండి మీ బాకీలన్నీ నేను తీరుత్తానని సెప్పరా? చూడరా? మీ అయ్య జీవచ్ఛవంలా ఎలా ఉన్నాడో!'' అంది.

శ్రీను అసహ్యంగా మొఖం తిప్పుకోబోతుంటే తల్లి అతని చేతులు పట్టుకోబోయింది. అంతలో నారాయణ వేగంగా వెళ్ళి భార్యను ప్రక్కకు లాక్కొచ్చి ఆవేశంగా ''ఏటే...ఏటే..వాడి సేతులు పట్టుకొనేది. తల్లిదండ్రులుగా మన న్యాయం మనం సేసాం. బిడ్డగా వాడి న్యాయం వాడు సేయకపోతే వాడి పాపం వాడిదే. ఏమే బిడ్డల్ని నమ్ముకోవడం కంటే మట్టిగడ్డల్ని నమ్ముకోవడం మంచిదే. మావు బండల భూమి, పనికిరాని భూమి అన్న ఆ భూమిలోనే ఈయేడు నీళ్ళుబడి నాలుగు మొక్కలు బడ్డాయే. మనల్ని ఈ బిడ్డ మోసం జేసినా ఆ బిడ్డ మోసం జేయడే. ఆ బిడ్డేనే మనకు నాలుగు మెతుకులెట్టేది'' అని బాకీల వాళ్ళ వైపు తిరిగి ''అయ్యలారా! నేజేసిన అప్పులు తాగటానికో, తిరగటానికో జేసిన అప్పులు కావు. కన్నబిడ్డ సదువుకోసం జేసిన అప్పులు. ఈ యేడాది పంటల్లో మీ అప్పులన్నీ తీరుస్తాను. ఒక వేల తీర్చలేకపోతే మీ ఇల్లల్లో ఊడిగం జేసైనా తిరుత్తాను.'' అన్నాడు.

ఏం మాట్లాడలేకపోయారా బాకీలవాళ్లు. నారాయణ మాటల్లో నిజముందనిపించింది. మౌనంగా వెళ్ళిపోయారు. నారాయణ భార్యతో పలుగుపార, బట్టిపొలం బయలుదేరాడు. ★